ANN తెలుగు
Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
11-07-2025
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 218 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శుక్రవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## కేసీఆర్ డిశ్చార్జ

**యశోద ఆస్పత్రిలో వైద్యపరీక్షలు పూర్తి**

**అనంతరం నందినగర్‌లోని నివాసానికి మాజీ సీఎం**

హైదరాబాద్, మహా: మాజీ సీఎం కేసీఆర్‌ను ఆసుపత్రి నుంచి వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఆయనకు యశోద ఆస్పత్రిలో వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. అనంతరం హైదరాబాద్‌లో నందినగర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు. వైద్యుల సూచనలతో గురువారం ఉదయం సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో కేసీఆర్ చేరారు. దీంతో ఆయనకు మరోసారి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అసలు అయితే.. జులై 3వ తేదీన కేసీఆర్ అనారోగ్యంతో సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరారు. ఆ సమయంలో బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలు పరిశీలించేందుకు రెండు రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాలంటూ ఆయనకు వైద్యులు సూచించారు.దీంతో ఆయన యశోదలో చేరారు. ఆరోగ్యం కుదుటపడడంతో రెండు రోజులకే అంటే.. జులై 5వ తేదీన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని.. ఆ తర్వాత మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని మాజీ సీఎం కేసీఆర్‌కు వైద్యులు సూచించారు. దాంతో వైద్య పరీక్షల కోసం కేసీఆర్ మళ్లీ గురువారం యశోద ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు.

**టాప్ న్యూస్**

### తెలంగాణలో వరి అవసరం లేదు



- దేశంలో ఎవరూ ఆకలితో చనిపోవడం లేదు
- ప్రతీ రాష్ట్రంలో వరి ఎక్కువ ఉన్నది
- ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి సంచలన వ్యాఖ్యలు

02

### మా నాన్న కాదు నేనొస్తా!



- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చర్చ పెడుదాం
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఛాలెంజ్
- తులం బంగారం, పించన్లు ఎందుకు పెంచడం లేదో చర్చిద్దాం
- మహిళలందరం కలిసి వస్తాం.. డిస్కషన్ చేద్దాం
- హామీల ఎగవేతలో మేటి రేవంత్‌రెడ్డి అంటూ మండిపాటు

02

### ఇది చరిత్రాత్మక నిర్ణయం



- రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లడాన్ని స్వాగతిస్తున్నాం
- క్యాబినెట్ నిర్ణయాలపై టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ హర్షం

02



# బీసీలకు 42శాతం రిజర్వేషన్లు

## స్థానిక సంస్థల్లో అమలుకు కేబినెట్ తీర్మానం

- ముఖ్యమంత్రి రేవంత్ ఆధ్వర్యంలో చారిత్రక నిర్ణయం
- ఇప్పటివరకు 18సార్లు మంత్రివర్గ సమావేశాలు.. 327 నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం తీర్మానించింది. ఇందుకు సంబంధించి ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ అంశంపై ముఖ్యమంత్రి అధ్యక్షతన డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం చర్చించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానించింది. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గత మార్చి నెలలో జరిగిన సమావేశాల్లో బిల్లులకు శాసనసభ ఆమోదించి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి నివేదించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పటివరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలును సమావేశం చర్చించింది. గతంలో జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో ప్రధానమైన 23 శాఖలకు సంబంధించి 327 అంశాలపై నిర్ణయాలు తీసుకుంది.

### కొత్త సంప్రదాయం

ఈసారి రాష్ట్ర మంత్రివర్గం కేబినేట్ భేటీలకు సంబంధించి కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు జరిగిన కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అమలుపై సమీక్ష జరిపింది. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు 18 కేబినెట్ సమావేశాలు జరిగాయి. ఈరోజు 19వ సమావేశం జిరగింది. గతంలో జరిగిన సమావేశాల్లో మొత్తం 327 అంశాలను చర్చించింది. వీటిలో 321 అంశాలను కేబినేట్ ఆమోదించింది. వీటి అమలు పురోగతిని శాఖలవారీగా అధికారులతో మంత్రివర్గం చర్చించింది.

వాటిల్లో 321 నిర్ణయాలు అమలు జరగ్గా మిగిలిన ఆరింటిపై మంత్రిమండలి అవసరమైన వివరణను ఇచ్చింది. 4 గంటల పాటు ఈ సమావేశం సాగింది.

మిగతా 2లో

### కొడుకు దిద్దిన వ్యాపారం

**అనిల్ ఈజ్ బ్యాక్**

సరికొత్త బిజినెస్ స్టార్ అనిల్ వారసుడు జై అన్మోల్

వివరాలు 2లో


### వీడు మామూలోడు కాదు

- అధ్యక్ష పదవి కోసం మాజీ మంత్రి సంతకం పోర్జరీ
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు అరెస్టుతో వెలుగులోకి కీలక విషయాలు

వివరాలు 2లో







# బీసీలకు 42శాతం రిజర్వేషన్లు



(మొదటిపేజీ తరువాయి)

42 శాతం బీసీ రిజర్వేషన్ లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్ళాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆర్డినెన్సు తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది.

**కేబినెట్ కీలక నిర్ణయాలు :**

కేబినెట్‌లో కీలక అంశాలను ఆమోదించామని రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పొన్నం ప్రభాకర్ , జూపల్లి కృష్ణారావు , వాకిటి శ్రీహరి , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి మీడియాకు వివరాలు తెలిపారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ప్రభుత్వం ఆమోదించింది. విద్యా ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ బీసీ లకు 42 శాతం రిజర్వేషన్స్ ప్రాతినిధ్యం కల్పించే రెండు బిల్లులను అదే రోజు అసెంబ్లీలో ఆమోదించింది. ఇటీవలే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశంపై గౌరవ హైకోర్టు కూడా నెలాఖరులోపు రిజర్వేషన్స్ ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వీటన్నింటినీ చర్చించిన మంత్రివర్గం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుంది.

సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ డెడికేటేడ్ కమిషన్ ను నియమించింది. రాష్ట్ర ప్రణాళిక విభాగం అధ్వర్యంలో కుల గణన చేపట్టింది. వీటి ఆధారంగానే అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదం చేసుకుంది. అందుబాటులో ఉన్న ఎంపిరికల్ డేటా ఆధారంగా, జనాభా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని తీర్మానించింది. బీసీల రిజర్వేషన్ల ను ఖరారు చేసేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్ గా, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా యూనిట్ గా, జడ్పీ ఛైర్మన్లకు రాష్ట్రం యూనిట్ గా పరిగణిస్తారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుగుణంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న పంచాయతీరాజ్ చట్టం2018 సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ చట్టంలో చేయాల్సిన సవరణలకు అవసరమైన చర్యలు చేపడుతుంది. రాష్ట్రంలో కొత్తగా రెండు ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఎయిమిటీ యూనివర్సిటీ, సెయింట్ మేరీ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అమిటీ యూనివర్సిటీలో మన తెలంగాణ విద్యార్థులకు, అంటే మన స్థానిక విద్యార్థులకు 50 శాతం అడ్మిషన్లకు అవకాశం కల్పించాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. సంగారెడ్డి జిల్లాలో ఇటీవల రెండు కొత్త మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పడ్డ జిన్నారం, ఇంద్రీశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. వచ్చే కేబినేట్ సమావేశంలోపు కమిటీ తమ నివేదికను అందించాలని గడువు నిర్ణయించింది. ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ను, కొత్తగా నిర్మించే గోశాల డిజైన్లను మంత్రివర్గ భేటీలో ప్రదర్శించారు. రాష్ట్రంలో 306 గోశాలలున్నాయి. హైదరాబాద్లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధాన పత్రం రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

### కొత్తగా 22 వేల ఉద్యోగాలు


ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. వీటితో పాటు మరో 17084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. కొత్తగా 22033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం చర్చించింది. వివిధ విభాగాల్లో పని చేస్తున్న ప్రతీ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధినిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీ కి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. రెండు నెలల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది.

# తెలంగాణలో వరి అవసరం లేదు

## దేశంలో ఎవరూ ఆకలితో చనిపోవడం లేదు

- ప్రతీ రాష్ట్రంలో వరి ఎక్కువ ఉన్నది
- ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో వరి అవసరం లేదని, అవసరానికి మించి ఎన్నో రెట్లు ఎక్కువ వరి ఇక్కడ పండిస్తున్నారని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఎవరూ వరి లేక ఆకలితో చనిపోవడం లేదన్నారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాళేశ్వరం పని చేయకున్న తెలంగాణ వరి పంట పెరిగిందని, కేంద్రం యూరియా సబ్సిడీ ఇచ్చి వరి పంట కొనుగోలు చేస్తుందన్నారు. మనం పండించి తినేది వరి కాదని యూరియాతో పండించే వరి మాత్రమేనన్నారు. తెలంగాణలో 45 లక్షల టన్నుల వరి తింటామని పండించేది మాత్రం 2 కోట్ల టన్నులని, వరి కొనుగోలు పెంచాలని కేంద్ర మంత్రి నడ్డా ను సీఎం రేవంత్ కోరారని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న రోహింగ్యాలు, బంగ్లా దేశీయులను గుర్తించి వెనక్కి పంపాలని, అక్రమంగా 4 కోట్ల బంగ్లా దేశీయులు మన దేశంలోకి చొరబడ్డారని పేర్కొన్నారు. ఇందులో 20 లక్షల మంది వరకు తెలంగాణలో ఉంటారని, మోడీ ప్రభుత్వం వచ్చాక బోర్డర్ వ్యవస్థ ను పటిష్ట పరిచిందని గుర్తు చేశారు. గతంలో తాను కూడా హైడ్రా ను మెచ్చుకున్నానని, బిల్డర్స్ మేలు కోసం హైడ్రా తెచ్చారని, సల్కాం చెరువులో ఉన్న పాతిమ కాలేజీ ను కూల్చే దమ్ము ఈప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. పాతబస్తీ నేతలకు కాంగ్రెస్ లొంగిపోయిందని, హైడ్రా క్రెడిబిలిటీ కోల్పోయిందన్నారు. వికారాబాద్ లో లేక్ మధ్యలో ఇల్లు కట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి విరుద్ధంగా మాట్లాడే వారిని ఉపేక్షించేది లేదని, కొంత మంది మంచి తనంతో పార్టీకి నష్టం జరుగుతుందన్నారు.



## ఇది చరిత్రాత్మక నిర్ణయం

**రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లడాన్ని స్వాగతిస్తున్నాం**

క్యాబినెట్ నిర్ణయాలపై టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ హర్షం



**హైదరాబాద్, మహా:** ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విప్లవాత్మక అడుగు అని పేర్కొన్నారు. క్యాబినెట్‌లో బీసీ రిజర్వేషన్లు అమలు కోసం ఆర్డినెన్స్ తేవడానికి నిర్ణయం తీసుకోవడం స్వాగతిస్తున్నామన్నారు. 2018 చట్టాన్ని సవరించి బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం సామాజిక విప్లవానికి నాంది అని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని చేసిన డిమాండ్‌ను దేశంలో మొదటగా తెలంగాణలో అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి వర్గానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ సమాజం, ప్రధానంగా బీసీలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని మహేశ్ కుమార్ గౌడ్ కోరారు.

# వీడు మామూలోడు కాదు

## అధ్యక్ష పదవి కోసం మాజీ మంత్రి సంతకం ఫోర్జరీ


- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు అరెస్టుతో వెలుగులోకి కీలక విషయాలు



**హైదరాబాద్, మహా :** హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ వివాదంలో ఐదుగురు అరెస్ట్ అయినట్లు సీఐడీ ప్రకటించింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాసరావు, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేంద్ర యాదవ్, హెచ్‌సీఏ సీఈవో సునీల్ కాంటే, చక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు జి .కవితను అరెస్టు చేసినట్లు సీఐడీ పేర్కొంది. హెచ్‌సీఏ నిధులను భారీ ఎత్తున దుర్వినియోగం చేసినట్లు సీఐడీ గుర్తించింది. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధరమ్ గురువారెడ్డి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన సీఐడీ.. నకిలీ పత్రాలతో జగన్ మోహన్ రావు అధ్యక్షుడిగా పోటీ చేసినట్లు గుర్తించింది. నకిలీ పత్రాలతోనే జగన్ మోహన్ రావు క్లబ్ ఏర్పాటు చేసినట్లు సీఐడీ విచారణలో బయటపడింది. గౌలిపుర క్రికెట్ క్లబ్ బీఎన్ అధ్యక్షుడు సి.కృష్ణ యాదవ్ సంతకాన్ని జగన్ మోహన్ రావు ఫోర్జరీ చేశారు. శ్రీచక్ర క్రికెట్ క్లబ్ కోసం నకిలీ పత్రాలను సృష్టించారని విచారణలో వెల్లడైంది. ఈ నకిలీ పత్రాల ద్వారా ఓ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. దీని వల్ల జగన్ మోహన్ రావు హెచ్‌సీఏలో అధ్యక్షుడిగా పోటీ చేశారని సీఐడీ గుర్తించింది. జగన్ మోహన్ రావు , సీజే శ్రీనివాస్ రావు, ట్రెజరర్, హెచ్‌సీఏ సీఈవో సునీల్ కుట్రపూరితంగా ఎన్నిక అయినట్లు విచారణలో సీఐడీ బయట పెట్టింది. నేరపూరిత నమ్మక ద్రోహంతో, ప్రజా నిధులను జగన్ మోహన్ రావు దుర్వినియోగం చేశారని సీఐడీ తెలిపింది.

హెచ సీఏ అధ్యక్ష పదవిని అడ్డు పెట్టుకున్న జగన్ మోహన్ రావు ఐపీఎల్, ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని బెదిరించినట్లు సీఐడీ గుర్తించింది. కాంప్లిమెంటరీ టిక్కెట్లపై జగన్ మోహన్ రావు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు విచారణలో తేలింది. తాము కోకరినన్ని టికెట్లను ఎస్ఆర్ హెచ్ మేనేజ్ మెంట్ ఇవ్వడం లేదన్న దురుద్దేశ్యంతోనే వేధింపులకు గురి చేసేందుకు కార్పొరేట్ బాక్సులకు ఉద్దేశపూర్వకంగా తాళాలు వేసినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. అంతే కాకుండా తాము చెప్పినట్లు వినకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారని సీఐడీ విచారణలో బయటపడింది. ఈకేసులో అరెస్ట్ చేసిన ఐదుగురిని గురువారం నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టారు.

## ఢిల్లీలో భూకంపం



- రిక్టర్ స్కేలుపై 4.1గా తీవ్రత నమోదు
- కొన్ని సెకన్ల పాటు బలంగా కంపించిన భూమి
- హర్యానాలోని రేవారి జిల్లాలో భూకంప కేంద్రం
- నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్‌లోనూ ప్రకంపనలు

**ఢిల్లీ, మహా:** దేశ రాజధాని ఢిల్లీలో గురువారం ఉదయం భూకంపం సంభవించింది. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో బలమైన భూకంపం సంభవించింది. గురువారం ఉదయం 9:04 గంటలకు భూమి అకస్మాత్తుగా కంపించడం ప్రారంభించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైనట్లు అధికారులు అంచనా వేశారు. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్‌లలో దాదాపు 10 సెకన్ల పాటు భూకంప ప్రకంపనలు సంభవించాయి. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, భివానీ, ఝజ్జర్, బహదూర్‌గఢ్ సహా అనేక నగరాల్లో భూకంప ప్రకంపనలు సంభవించాయి. భూకంప కేంద్రం హర్యానాలోని ఝజ్జర్‌లో ఉందని చెబుతున్నారు. భూకంప కేంద్రం పశ్చిమ ఢిల్లీకి కేవలం 51 కిలోమీటర్ల దూరంలో ఉందని, రాజస్థాన్, యూపీలోని పలు ప్రదేశాల్లోనూ భూమి కంపించిందని అధికారులు తెలిపారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు. అలాగే భూకంపం సంభవించిన వెంటనే జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఎన్డీఆర్ఎఫ్ సలహా ఇచ్చింది. ప్రజలు భయపడవద్దని, బయటకు పరిగెత్తవద్దని, మెట్లు ఎక్కవద్దని కోరింది. భూకంపం సంభవించినప్పుడు వాహనం నడిపేవారు బహిరంగ ప్రదేశంలో ఆగిపోవాలని సూచించింది.

## ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎంపీలకూ కోటా ఇవ్వాలి

- ఎమ్మెల్యేల మాదిరిగా శాతం కోటా కేటాయించాలి
- పార్టీలకు అతీతంగా అవకాశం కల్పించండి
- సీఎం రేవంత్‌కు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు లేఖ

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు లేఖ రాశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో ఎంపీలకు 40 శాతం కోటా కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు రఘునందన్ రావు బహిరంగ లేఖ రాస్తూ.. రాష్ట్రంలోని పేదలు, బలహీన వర్గాల ప్రజలకు నూతన గృహాలను అందించేందుకు ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ప్రారంభించేందుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులను అనుసంధానించడం సానుకూలమైన పరిణామం అని అన్నారు.



**మాకూ 40 శాతం కోటా..**

ఇప్పుడు మీరు లబ్ధిదారుల ఎంపికలో స్థానికంగా గెలిచిన ఎమ్మెల్యేలకు 40 శాతం కోటా కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయం అన్నారు. ప్రజల మద్దతుతో గెలిచిన ఎమ్మెల్యేలకు గౌరవం ఇవ్వడంలో ఈ నిర్ణయం కీలకమైనదన్నారు. ప్రజల మద్దతుతో గెలిచిన తెలంగాణ రాష్ట్రంలోని 17 మంది లోక్ సభ్యులకు కూడా మరో 40 శాతం కోటా కేటాయించగలరని రఘునందన్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ నిర్ణయం పార్టీపరమైన విషయాలకు అతీతంగా అందరికీ సమాన అవకాశాలను కల్పించడమే కాకుండా, కేంద్రరాష్ట్ర భాగస్వామ్యంతో అమలవుతున్న ఈ పథకంలో లబ్ధిదారుల ఎంపిక మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు దోహదపడుతుందన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రిగా మీరు త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకుని ఎంపీలను కూడా గౌరవిస్తూ ఈ విషయంలో న్యాయమైన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నట్లు లేఖలో ప్రస్తవించారు.

# పాఠం చదవరాదు.. లెక్కలు చేయలేరు

## సూర్యుడు, చంద్రుడికి తేడా తెలియదు

- పరిసరాలు, చరిత్రలపై అవగాహన లేనేలేదు
- రాష్ట్ర విద్యార్థుల సామర్థ్యాల్లో లోపాలు
- పరాక్-2024 జాతీయ సర్వేలో తేటతెల్లం



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువులో రాణించడం లేదు. జాతీయ స్థాయి సగటు కంటే వెనుకబడి ఉన్నారు. ఈ మేరకు పర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్ రివ్యూ అండ్ అనాలిసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (పరాక్) సర్వే2024లో ఆందోళనకరమైన నిజాలు వెలుగు చూశాయి. పరాక్‌ను ఇది వరకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్)గా వ్యవహరించేవారు. మూడు, ఆరు, తొమ్మిదో తరగతి పిల్లలకు భాషలు, గణితం, సైన్స్‌లో ప్రతిభాపాటవాలను ఏ మేరకు ఉన్నాయో ఈ సర్వే ద్వారా తెలుసుకుంటారు. దేశవ్యాప్తంగా విద్యాప్రమాణాలను అంచనా వేసేందుకు పరాక్ సర్వేను ప్రభుత్వాలు, విద్యాసంస్థలు కీలకంగా భావిస్తాయి. తాజాగా పరాక్2024 సర్వే నివేదికను కేంద్ర విద్యాశాఖ విడుదల చేసింది. ఇందులోని వివరాల ప్రకారం విద్యార్థులు వాక్యాలు చదవలేకపోతున్నారని, లెక్కలు చేయలేకపోతున్నారని, అంకెలను కూడా ఆరోహణ అవరోహణ క్రమంలో చెప్పలేకపోతున్నారని తేలింది. అంతేకాకుండా మూడో తరగతి విద్యార్థులకు సూర్యుడు, చంద్రుడి బొమ్మలను చూపిస్తే ఏది ఏంటో చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని సర్వేలో స్పష్టమైంది. చాలా అంశాల్లో జాతీయ సగటుతో పోల్చితే తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందని తేలింది.

### పరాక్ సర్వే- 3వ తరగతి విద్యార్థులు

- రోజువారి మాటల్లో సరైన పదాలు ఉపయోగించడం తెలిసినవారు 62 శాతం
- కథలు చెప్పి, అందులోని సారాంశాన్ని, సందేశాన్ని చెప్పగలిగేవారు 53 శాతం
- 199 వరకు అంకెలను ఆరోహణ, అవరోహణ క్రమంలో చెప్పగలిగేవారు 48% శాతం
- రెండంకెల సంఖ్యలతో కూడికలు, తీసివేతలు చేయగలిగేవారు 51% శాతం
- నిమిషం, గంట, రోజు, వారం, నెలపై అవగాహన కలిగినవారు 53 శాతం

### 6వ తరగతి విద్యార్థులు

- భాషల్లోని పాఠాలలో సందేహాలను వ్యక్తం చేయగలిగేవారు 52 శాతం
- పాఠాలలో సారాంశం తెలుసుకుని, ముగింపును అర్థం చేసుకోగలిగేవారు 54 శాతం
- గణితంలో స్థానం, పెద్ద సంఖ్యల విలువను చెప్పగలిగేవారు 54 శాతం
- భిన్నాలు, భాగాలు, విభజన చేయగలిగేవారు 24 శాతం
- మీటర్లు, సెంటీమీటర్లపై అవగాహన కలిగినవారు 34 శాతం
- దూరం, పొడవు, సమయం, చుట్టు కొలత, వైశాల్యం, బరువు గురించి తెలిసినవారు 37 శాతం
- గణిత సమస్యలు (పద పజిల్స్, మ్యాజిక్ స్క్వేర్ నిర్మాణం) పరిష్కరించేవారు 35 శాతం
- సూర్యచంద్రులు, నక్షత్రాలు, గ్రహాలను గుర్తించగలిగేవారు 38% శాతం
- బ్యాంక్, పోస్టాఫీస్, మార్కెట్, పంచాయతీ కార్యకలాపాలు తెలిసినవారు 52 శాతం

### 9వ తరగతి విద్యార్థులు

- వార్తా కథనాలు, సంపాదకీయాలలో ముఖ్యాంశాలను గుర్తించగలిగేవారు 54 శాతం
- గణితంలో 7 గుణిజాలు, 3 ఘాతాలను గుర్తించగలిగేవారు 37 శాతం
- ఘన, ద్రవ, వాయు ఆకారాలు, ఘణపరిమాణం, సాంద్రత గురించి తెలిసినవారు 33 శాతం
- వాతావరణం, సముద్రం, నేల నిర్మాణం, నదుల ప్రవాహం గురించి తెలిసినవారు 31 శాతం
- చరిత్రలోని ప్రధాన ఘట్టాలు, సమాజంపై ప్రభావం గురించి చెప్పగలిగినవారు 34 శాతం
- భిన్నత్వంలో ఏకత్వం, భాషలు, కళలు, యోగా గురించి తెలిసినవారు 33% మాత్రమే ఉన్నారు.

# మా నాన్న కాదు నేనొస్తా!

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చర్చ పెడుదాం

- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఛాలెంజ్
- తులం బంగారం, పింఛన్లు ఎందుకు పెంచడం లేదో చర్చిద్దాం
- మహిళలందరం కలిసి వస్తాం.. డిస్కషన్ చేద్దాం
- హామీల ఎగవేతలో మేటి రేవంత్‌రెడ్డి అంటూ మండిపాటు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** రైతులకు ఇచ్చిన హామీలపై బీఆర్ఎస్ నాయకులు చర్చకు రమ్మంటే సీఎం రేవంత్ తోకముడిచి జారుకున్నట్లు తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం గాడిన పడే సమయంలోనే కాంగ్రెస్ చేతిలోకి వెళ్లిందని, దీంతో మళ్లీ మన అస్థిత్వం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జై తెలంగాణ అనని వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని, అవినీతి చక్రవర్తి అసమర్థ ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి అవసరమా? అని ఆమె ప్రశ్నించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన జాగృతి సమావేశంలో ఆమె మాట్లాడారు. తొలుత సీఐటీయూ జిల్లా నాయకుడు, ఉద్యమ కెరటం జి.వీరన్న, వివిధ సంఘాల నాయకులకు జాగృతి కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఎన్నికల్లో మహిళలకు, దివ్యాంగులకు, యువతకు, విద్యార్థులకు, వృద్ధులకు ఒకరేమిటీ అందరికీ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పథకాల కంటే ఎక్కువే ఇస్తామని, అబద్దపు, మోసపు మాటలు మాట్లాడి హామీలు, గ్యారెంటీలు ఇచ్చి ఒక్కటీ కూడా సక్రమంగా అమలు చేయకుండా, దేవుళ్ల మీద ఒట్టు వేస్తూ సీఎం రేవంత్ రెడ్డి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.



**సెక్రటేరియట్ వాస్తు బాగలేదని..**

మహిళలకు నెలకు రూ.2,500, దివ్యాంగులకు రూ.8 వేల పెన్షన్, ఇతర పింఛన్‌దారులకు రూ.4 వేలు ఇస్తానని, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకం ద్వారా తులం బంగారం ఇస్తానని హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ యావత్తు తెలంగాణ సమాజాన్ని మోసం చేసిన మోసగాడు రేవంత్ రెడ్డి అని ధ్వజమెత్తారు. అడగకుండానే రైతులకు రైతు బంధు, రైతు బీమా ఇచ్చిన కేసీఆర్, అడిగినా ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతూ, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సీఎంకు రానున్న రోజుల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు వ్యవసాయం పండుగ అయితే, కాంగ్రెస్ ప్రభుత్వంలో దండగలా మారిందని ఆరోపించారు. సెక్రటేరియట్ వాస్తు బాగలేదని, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో, అధికారులతో సమావేశాలు పెడుతున్న సీఎంను తాను ఒకటే అడుగుతున్నానన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలపై పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనే చర్చ పెడుదామని, నిజంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేస్తే చర్చకు సిద్ధపడాలని ఆమె సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీతో సమావేశాలు పెట్టి హామీలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని, లేకుంటే ప్రజలే ఈ ప్రభుత్వ భరతం పడతారని హెచ్చరించారు.



హీరో విజయ్ దేవర కొండ కేసు

## సైబరాబాద్ పోలీసులపై జాతీయ ఎస్టీ కమిషన్ సీరియస్

**హైదరాబాద్, మహా:** హీరో విజయ్ దేవరకొండ కేసు విచారణకు కమిషనర్ రాకుండా ఏసీపీ రావడం పట్ల జాతీయ ఎస్టీ కమిషన్ అసహనం వ్యక్తం చేసింది.ఏప్రిల్ 26వ తేదీన రెట్రో సినిమా వేడుకలో గిరిజనుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ విజయ్ దేవరకొండపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు ఇదే అంశంపై జాతీయ ఎస్టీ కమిషన్ కు కూడా ఫిర్యాదు చేయడంతో, విచారణ చేపట్టిన కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ విచారణకు హాజరు కావాలని కమిషనర్ కు నోటీసులు ఇస్తే మీరెందుకు వచ్చారు, ఆ మాత్రం తెలియదా అంటూ మాదాపూర్ ఏసీపీ పట్ల అసహనం వ్యక్తం చేసారు. మరో 15 రోజుల్లో హైదరాబాద్ కమిషనర్ విచారణకు హాజరు అవ్వకపోతే, డీజీపీని విచారణకు రప్పించాల్సి ఉంటుందని ఏసీపీని జాతీయ ఎస్టీ కమిషన్ హెచ్చరించింది.



కేటీఆర్ ముందు మీ నాయిన నుండి

## ప్రతిపక్ష హోదా తెచ్చుకో

..ఎంపీ చామల ఫైర్

**హైదరాబాద్, మహా:** కేసీఆర్ కుటుంబం మాయలో పడకుండా కృష్ణా జలాల నుండి దక్షిణ తెలంగాణకు రావాల్సిన నీటి వాటా కోసం తెలంగాణ ప్రజలు, ప్రభుత్వం కొట్లాడాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 2 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్ కేవలం ఉత్తర తెలంగాణాలోని కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారన్నారు. కానీ సగం పనులు పూర్తి చేసిన జూరాల, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టులను పట్టించుకోలేదని అన్నారు. ఆ ప్రాజెక్టులపై ఐదారువేల కోట్లు ఖర్చు చేసినా కూడా లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవని చెప్పారు. కృష్ణా జలాలను కాపాడుకునేవాళ్లం అని అన్నారు. కేటీఆర్ కేవలం ఎమ్మెల్యే అని ముఖ్యమంత్రిని ఛాలెంజ్ చేయాలి అంటే ప్రతిపక్ష హోదా తెచ్చుకుని చేయాలన్నారు. దమ్ముంటే కేసీఆర్ నుండి ప్రతిపక్ష హోదా తెచ్చుకుని ఛాలెంజ్ చేయాలని చెప్పారు. కేసీఆర్ వయసులో పెద్దవాడు కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి ఫామ్ హౌస్ కే వచ్చి చర్చిద్దామని అంటున్నారని తెలిపారు. కేటీఆర్ సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసినంత మాత్రాన ముఖ్యమంత్రి అవ్వరని విమర్శించారు.



రోడ్లపై అక్రమ పార్కింగ్ చేస్తే

## కఠిన చర్యలు

సీఐ నాగరాజు గౌడ్

**ఎల్బీనగర్,మహా:** పెద్ద అంబర్ పేట్ లక్ష్మారెడ్డి పాలెం లో ఉన్న సర్వీస్ రోడ్లో అక్రమ పార్కింగ్ మరియు లారీ పార్కింగ్ యార్డ్ సమస్యలపై కాలనీ సభ్యులు ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ను కలిసి గురువారం వినతి పత్రం అందించడం తో ఎమ్మెల్యే ఆదేశాలతో వెంటనే స్పందించిన అధికారులు పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, హయత్ నగర్ సిఐ నాగరాజు ట్రాఫిక్ ఎస్ ఐ బోలిశెట్టి శ్రీనివాస్ స్థానిక మాజీ కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి మరియు కాలనీ సభ్యులతో కలిసి పరిశీలించడం జరిగింది, రెసిడెన్షియల్ జోన్ లో ఉన్న పార్కింగ్ యార్డ్ ను 10 రోజుల్లో తరలించాలని లేని పక్షం లో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పార్కింగ్ యార్డ్ యజమానికి కమిషనర్ నోటీస్ లు జారీ చేయటం జరిగింది,సర్వీస్ రోడ్ లో అక్రమ పార్కింగ్ చేసిన వాహనాలకు పోలీస్ లు చలానా లు విధించారు రేపటి నుండి ఎలాంటి పార్కింగ్ చేయకూడదని సీఐ నాగరాజు వాహనదారులను హెచ్చరించడం జరిగింది.కాలనీ లో రోజు పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని పంపాలని కాలనీ వాసులు కోరడం తో రేపటి నుండి గస్తీ పెంచుతామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు,కాలనీ ప్రజలు పాల్గొన్నారు...

# ఈసీపై సుప్రీం అసహనం

### సరిగ్గా ఎన్నికలకు ముందే ఎందుకు?.. బిహార్ ఓటరు జాబితా సవరణ డ్రైవ్‌పై సుప్రీం ప్రశ్న

### ఆధార్ ను పరిగణనలోకి తీసుకోమనడం సరికాదన్న సర్వోన్నత న్యాయస్థానం

**న్యూఢిల్లీ, మహా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేయాలన్న ఎన్నికల సంఘం నిర్ణయంపై సుప్రీంకోర్టుశ అసహనం వ్యక్తం చేసింది. ఈసీ తీసుకున్న ఎస్ఆర్ఐ నిర్ణయం వివాదాస్పదమైన నేపథ్యంలో ప్రతిపక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రతిపక్షాల వాదనను అత్యున్నత ధర్మాసనం సమర్థించింది. ఇది రాజ్యాంగం ప్రకారం జరుగుతున్న ప్రక్రియేనని వ్యాఖ్యానించిన సుప్రీం ఈసీ ఎంచుకున్న సమయంపైనే తమకు అభ్యంతరం ఉందని వ్యాఖ్యానించింది. ఓటరు జాబితాల సవరణ డ్రైవ్ చేపట్టడం అనేది సమస్యే కాదని, అయితే దానికి ఇది సరైన సమయమా? అని ఈసీని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధూలియా ప్రశ్నించారు. ఈ ఏడాది చివర్లోనే బిహార్ అసెంబ్లీ ఎన్నికలున్నాయని, ఇలాంటప్పుడు ఓటరు జాబితాల నుంచి ఎవరి పేర్లనైనా తొలగిస్తే వారు అప్పీల్ చేసుకోవడానికి తగిన సమయం మిగలదన్నారు. ఓటు హక్కును కోల్పోయేవారు, ఎన్నికల కంటే ముందే దాన్ని తిరిగి పొందేందుకు అప్పీల్ చేసుకునేందుకు సమయం తప్పక ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితాలు ఫైనలైజ్ అయ్యే వరకు వాటిని కోర్టులు పరిగణనలోకి తీసుకోవని, అలాంటప్పుడు అకస్మాత్తుగా ఓటు హక్కును కోల్పోయిన వారు అప్పీల్ చేసుకునే అవకాశాన్ని కోల్పోతారని జస్టిస్ సుధాంశు ధూలియా ఈసీకి తెలిపారు. ఓటరు జాబితాల సవరణ డ్రైవ్ చేపట్టడంలో తప్పేమీ లేదని, అయితే త్వరలో జరిగే బిహార్ అసెంబ్లీ పోల్స్‌తో సంబంధం లేకుండా దాన్ని నిర్వహించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు.

ఇది చాలా ముఖ్యమైన అంశమని, ప్రజాస్వామ్యపు పునాదులతో సంబంధం కలిగినదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈసీ అధికారాలు, అనుసరిస్తున్న విధానాలను పిటిషనర్లు సవాల్ చేస్తున్నారని పేర్కొంది. పిటిషనర్లు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని ఈసీకి సుప్రీంకోర్టు బెంచ్ సూచించింది. ఈసీకి సుప్రీంకోర్టు బెంచ్ మూడు ముఖ్యమైన ప్రశ్నలను సంధించింది. 1. ఓటరు జాబితాల సవరణకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టేందుకు ఈసీకి ఉన్న అధికారమేంటో చెప్పండి? 2. ఓటరు జాబితాల సవరణ డ్రైవ్‌కు సంబంధించిన సమీక్షా ప్రక్రియ ఎలా చెల్లుబాటు అవుతుందో చెప్పండి? 3. సరిగ్గా బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందే ఓటరు జాబితాల సవరణ డ్రైవ్‌ను ఎందుకు చేపడుతున్నారో చెప్పండి? అని అడిగింది.

**గుర్తింపు పత్రంగా ఆధార్ ను పరిగణించరా ?**

బిహార్‌లో ఈసీ తలపెట్టిన ఓటరు జాబితాల సవరణ డ్రైవ్ ఏకపక్షంగా, వివక్షాపూరితంగా ఉందని ఓ పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ్ కోర్టుకు తెలిపారు. గత పదేళ్లకుపైగా ఓటరు జాబితాలో పేర్లున్న వారిని స్వయంగా రీవేరిఫై చేసుకోమని ఈసీ చెబుతోందని, అయితే ఇందుకు ప్రభుత్వం జారీ చేసిన ఆధార్ లాంటి గుర్తింపు కార్డులను అనుమతించకపోవడం దారుణమన్నారు. దీనిపై ఈసీని సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్నించింది. ఓటర్ల వేరిఫికేషన్ కోసం ఆధార్ కార్డును కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం ఏమిటి? అని ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం అడిగింది. పౌరులకు ఇతరత్రా డాక్యుమెంట్లను జారీ చేసేందుకు ప్రభుత్వమే ఆధార్ కార్డును గుర్తింపు పత్రంగా పరిగణనలోకి తీసుకుంటోందనే విషయాన్ని బెంచ్ గుర్తుచేసింది. ఆధార్‌ను గుర్తింపు పత్రంగా పరిగణించకుంటే చాలామంది ఓటు హక్కును కోల్పోతారని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొంది. ఈసీ తరఫున సీనియర్ అడ్వకేట్ రాకేశ్ ద్వివేది వాదనలు వినిపిస్తూ ఓటరు జాబితాల సవరణ డ్రైవ్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తమకు పలు ప్రాథమిక అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. ఈయనతో పాటు సీనియర్ అడ్వకేట్లు కేకే వేణుగోపాల్, మణీందర్ సింగ్‌లు ఈసీ తరఫున వాదనలు వినిపించారు.

**ఈసీ వాదనలో లాజిక్ లేదు**

"చివరిసారిగా బిహార్‌లో 2003లో ఓటరు జాబితాల సవరణ జరిగింది. అప్పట్లో ఆ రాష్ట్ర జనాభా 4 కోట్లు. ఇప్పుడది 7.9 కోట్లు. నాటి నుంచి నేటిదాకా రాష్ట్రంలో 10 ప్రధాన ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఓటరు జాబితాల సవరణ చేస్తామని ఈసీ అంటోంది. ఈ లెక్కన 30 రోజుల్లోనే ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయాల్సి ఉంటుంది. అది సాధ్యమయ్యే పనేనా? ఓటరు వేరిఫికేషన్ కోసం ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోవచ్చనే సవరణలు జరిగాయి. అయినా ఆధార్‌ను వేరిఫికేషన్ కోసం పరిగణనలోకి తీసుకోమని ఈసీ వాదిస్తోంది. ఈసీ వాదనలో లాజిక్ లేదు. ఓటరు జాబితాల సవరణ కోసం ఈసీ సూచించిన 11 డాక్యుమెంట్లలో కూడా లాజిక్ లోపించిందని నిరూపిస్తున్నాయి. న్యాయవ్యవస్థ సహా పలు వర్గాల వారికి ఓటరు వేరిఫికేషన్ వేళ ఈ డాక్యుమెంట్ల సమర్పణ నుంచి మినహాయింపును ఇచ్చారు. చివరకు ప్రజల ఓటరు ఐడీలను కూడా పరిగణనలోకి తీసుకునేది లేదని ఈసీ అంటోంది. ఓటర్ల తల్లిదండ్రుల సమాచారాన్ని వేరిఫై చేసేందుకు డాక్యుమెంట్లను అడుగుతోంది" అని ఓ పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది శంకర నారాయణ్ వాదన వినిపించారు.



## అలా అనడం సరికాదు

**ఈసీ చర్యలలో లాజిక్ లేదనడం సరికాదు. ఎన్నికల సంఘం చేస్తున్న తప్పేమిటి? రాజ్యాంగం ప్రకారమే వారు నడుచుకుంటున్నారు. రాజ్యాంగంలో లేనిది వారు చేస్తున్నారని మీరు చెప్పకూడదు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21 (3) ప్రకారం ఓటరు జాబితాల సవరణ కోసం ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టే అధికారం ఈసీకి ఉంది" అని పిటిషనర్ తరఫు న్యాయవాది శంకర నారాయణ్‌కు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధూలియా చెప్పారు. బిహార్‌లో ఎన్నికలకు ముందు ఓటరు జాబితాల సవరణ డ్రైవ్‌ను చేపట్టడాన్ని సవాల్ చేస్తూ 10కిపైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. పిటిషనర్లలో స్వచ్ఛంద సంస్థ 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) కూడా ఉంది. పిటిషన్లు దాఖలు చేసిన ప్రముఖుల్లో ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝా, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత సుప్రియా సూలే, సీపీఐ నేత డీ రాజా, సమాజ్‌వాదీ నేత హరీందర్ సింగ్ మాలిక్, శివసేన (యూబీటీ) నేత అర్వింద్ సావంత్, జేఎంఎం నేత సర్ఫరాజ్ అహ్మద్, సీపీఐ(ఎంఎల్) నేత దీపాంకర్ భట్టాచార్య ఉన్నారు. బిహార్‌లో ఓటరు జాబితాల సవరణ డ్రైవ్‌ను ఆపాలని వారు సుప్రీంకోర్టును కోరారు.**

## సీతక్కను విమర్శించే స్థాయి వారికి లేదు

టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ఆదిలాబాద్, మహా:** రాష్ట్ర మంత్రి సీతక్కను విమర్శించే స్థాయి మాజీ ఎంపీ మాలోతు కవిత, తుల ఉమకు లేదని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవ భవన్లో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ మెప్పు కోసమే వారిద్దరు అనవసర ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. వాటిపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కేవలం సీతక్క మీద పనిగట్టుకొని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకుల వేధింపులకు అనేక మంది బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సూసైడ్ లేఖలు, సెల్ఫీలు తీసుకొని ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు.సిరిసిల్లలో లారీలతో తొక్కించిన చరిత్ర మీదని విమర్శలు గుప్పించారు. సీతక్క అనునిత్యం ప్రజలు, గిరిజనుల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని తెలిపారు. జీఓ 49 టైగర్ కారిడార్ కు సంబంధించి ప్రభుత్వ స్థాయిలో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో జీఓ నెంబర్ 3ని రద్దు చేస్తే వారిద్దరూ ఎందుకు మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి సీతక్కపై అవాకులు, చెవాకులు పేలుతూ మరోసారి నోరు పారేసుకుంటే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునీల్ జాదవ్, పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,నాయకులు గిమ్మ సంతోష్, ఐన్టియుసి జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, సంతోష్, శ్రీలేఖ, రఫిక్, అశోక్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## సీసీఐ పునరుద్ధరణపై మంత్రుల ప్రకటనలు స్వాగతిస్తున్నాం


సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ మల్లేష్



**ఆదిలాబాద్, మహా:** సీసీఐ పునరుద్ధరణ పై కేంద్ర, రాష్ట్ర మంత్రులు సానుకూలంగా స్పందించడాన్ని స్వాగతిస్తున్నామని, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఫ్యాక్టరీ ప్రారంభానికి కార్యాచరణ రూపొందించాలని సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ అన్నారు. గురువారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర మంత్రి కుమార స్వామి, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సీసీఐ పునరుద్ధరనకు తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పడం అభినందనీయమన్నారు. సీసీఐ సాధన కమిటీ తరపున ఏప్రిల్ లో కేంద్ర మంత్రిని కలిసి విన్నవించడం జరిగిందని, ఆరు నెలల వ్యవధిలో ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రితో పాటు పరిశ్రమల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించడం సంతోషకరమన్నారు. దాదాపు నాలుగు ఏళ్ల నుంచి సాధన కమిటీ తరపున ఉద్యమిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలని, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు తగు సహకారం అందించాలని కోరారు.

# భూ కబ్జాల పర్వం..

- ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు వ్యక్తుల భూములు స్వాహా
- ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో బురిడీ
- అక్రమార్కుల ఆటకట్టిస్తున్న పోలీసు యంత్రాంగం
- జిల్లాలో హాట్ టాపిక్ గా మారిన భూముల వ్యవహారం



**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లాలో భూ కబ్జాల పర్వం పెరిగిపోయింది. భూమికి ఉన్న విలువను బేరీజు వేసుకుంటున్న కొందరు కబ్జారాయుళ్లు దీన్నో వ్యాపారంగా మార్చుకున్నారు. అక్రమ మార్గాల్లో ఇతరుల భూములు కొట్టేయడం.. అప్పటికే ఇతరుల పేర్లపై ఉన్న భూములను చూపించి మరొకరికి విక్రయించడం పరిపాటిగా మారింది. అక్రమార్కుల గారడి మాటలను నమ్ముతూ రూ.లక్షలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేస్తున్న అయామకులు తీవ్రంగా మోసపోతున్నారు. తాజాగా పోలీసు యంత్రాంగంపై వీటిపై దృష్టి సారించడంలో అక్రమాల డొంక కదులుతోంది. పోలీసులు అక్రమార్కుల భరతం పడుతున్నారు. భూ మాఫియా ముఠాలను కటకటాల్లోకి పంపిస్తుండటం జిల్లాలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. భూములు కొనుగోలు చేసిన మోసపోయిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండటంతో విచారణ చేపడుతున్న అధికారులు అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తూ జైలుకు పంపిస్తున్నారు. జిల్లాలో కొన్ని రోజులుగా జరుగుతున్న ఈ ఘటనలతో అక్రమార్కుల వెన్నులో వణుకు పుడుతుండగా.. భూ బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**రోజుకో కేసుతో కలకలం..**

జిల్లాలో భూములకు సంబంధించి ప్రస్తుతం రోజుకో కేసు నమోదు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అనేక మంది భూ బాధితులు వారికి జరిగిన మోసాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తుండటం.. సత్వరం స్పందిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టడం.. సూత్రధారులను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. భూ బాధితులకు న్యాయం జరుగుతుండటంతో అనేక మంది జిల్లా ఎస్పీ కార్యాలయానికి వరుస కడుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. జిల్లాలో భూ అక్రమాలకు సంబంధించి ఇప్పటి వరకు దాదాపు 20కి పైగానే కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. భూ అక్రమార్కుల్లో పట్టుబడిన వారిలో ఇప్పటి వరకు కొందరు రాజకీయ నాయకులు ఉండగా.. మరికొందరు రియల్ వ్యాపారులు, ఇంకొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉండటం గమనార్హం. ఇన్నాళ్లు అసలు భూ యజమానులను బెదిరిస్తూ తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో ఉన్న కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు సైతం జైలుకు వెళ్లడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూమికి ఇంటి నెంబర్ జారీ చేసిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులపై కూడా కేసు నమోదు కావడం గమనార్హం.

**నకిలీ పత్రాలతో బురిడీ..**

ఇతరుల నుంచి భూములను కాజేయడంలో సిద్ధహస్తులైన కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించడం, ఫోర్జరీ సంతకాలు తయారు చేసి భూ క్రయ విక్రయాలకు పాల్పడినట్లు తేలింది. ఇది వరకే ఒకరి పేరుపై ఉన్న ప్లాటును ఇతరులకు కట్టబెట్టి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించడం.. తీరా కొనుగోలు చేసిన వారు సదరు భూమిలోకి వెళ్లగానే అప్పటికే అసలు భూ యజమానులు ఉండటంతో వాటిని కొనుగోలు చేసిన వారు కంగుతింటున్నారు. మరోపక్క కొందరు అధికారుల సంతకాలు కూడా ఫోర్జరీ చేసి రిజిస్టేషన్ చేయించడం వంటి ఘటనలు బయటపడ్డాయి. భూమి పత్రాలను ఫోర్జరీ చేసి ప్లాట్లను అక్రమంగా ఆక్రమించి నిజమైన ఆస్తి యజమానులను డబ్బుల కోసం బెదిరించిన ముఠాలను సైతం పోలీసులు కటకటాల్లోకి పంపించారు. ఆదిలాబాద్ పట్టణంలో భూములు విలువలు పెరగడం.. రియల్ వ్యాపారం కూడా జోరుగా సాగుతుండటంతో ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు భూఅక్రమాలకు పాల్పడుతున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కొందరి రాజకీయ అండదండలతో తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతోనూ ఇలాంటి భూ అక్రమాలకు తెరలేపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లా పోలీసుశాఖ వీటిపై ప్రత్యేక దృష్టిసారించడంతో భూ అక్రమార్కుల డొల్లతనం బయట పడుతుండగా.. నష్టపోయిన బాధితులకు న్యాయం జరుగుతోందనే వాదన వినిపిస్తోంది.



జిల్లాలో నెలకొన్న సమస్యలు

## పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ కు ఐద్వా నాయకుల వినతి

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆశాలత మాట్లాడుతూ జిల్లాలో సమస్యలపై గత వారం రోజులుగా సర్వే నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, వసతిగృహాలు, పలు కాలనీల్లో నిర్వహించిన సర్వేలో వివిధ సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వివరించారు. వాటిని పరిష్కరించాలని కోరారు. జిల్లాలో అనుమతి లేని బెల్టు దుకాణాలను తొలగించాలని, కల్తీ కల్లును పూర్తిగా నివారించాలని పేర్కొన్నారు.

## భక్తి ప్రపత్తులతో గురు పౌర్ణమి వేడుకలు

**ఆదిలాబాద్, మహా:** జిల్లావ్యాప్తంగా గురు పౌర్ణమి వేడుకలను భక్తిప్రపత్తుల నడుమ నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం ఉదయం నుండే వివిధ ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అభిషేకాది పూజలను భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ప్రధానంగా దత్త మందిరాలు, సాయి బాబా ఆలయాల్లో గురు పౌర్ణమిని పురస్కరించుకుని.. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. గురు పౌర్ణమి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించిన పండితులు... శాస్త్రోక్తంగా పూజలను జరిపారు. పండగ నేపథ్యంలో ఆయా ఆలయ ప్రాంగణాలు భక్త జనంతో కిటకిటలాడాయి. జిల్లాకేంద్రంలోని దస్నాపూర్ లో గల దత్త మందిరంలో గురు పౌర్ణమిని భక్తి ప్రపత్తుల నడుమ నిర్వహించారు. దత్తాత్రేయుడిని ప్రత్యేక పూజలతో కొలిచి భక్తి భావాన్ని చాటుకున్నారు. ఉదయం నుండే భక్తుల తాకిడి కనిపించగా... ఆలయ కమిటి ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక పూజలు, హారతులతో దత్తాత్రేయుడిని కొలిచారు. వ్యాస పౌర్ణమి విశిష్టతను వేద పండితులు వివరిస్తూ.... పూజాది క్రతువుల్లో పాలు పంచుకున్నారు. అదేవిధంగా శాంతినగర్ లోని సాయి బాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చిన భక్తులు... బాబాను దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. ఉదయం నుండే భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.



## ఓటీటీలో డిటెక్టివ్ సినిమా స్ట్రీమింగ్

మలయాళంలో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన సినిమా 'డిటెక్టివ్ ఉజ్వలన్'.. ప్రేక్షకులను మెప్పించిన ఈ సినిమా ఓటీటీ ప్రకటన వచ్చేసింది. మిస్టరీ కామెడీ జానర్‌లో దర్శకులు ఇంద్రనీల్ గోపికృష్ణన్, రాహుల్ సంయుక్తంగా తెరకెక్కించారు. సోఫియా పాల్ వీకెండ్ బ్లాక్‌బస్టర్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఇందులో ధ్యాన్ శ్రీనివాసన్, సిజు విల్సన్ ప్రధాన పాత్రల్లో నటించారు. మే 23న విడుదలైన ఈ చిత్రం రూ. 4.5 కోట్ల బడ్జెట్‌తో నిర్మించబడింది. ఈ చిత్రం మలయాళంలో రూ. 10 కోట్ల మేరకు కలెక్షన్స్ రాబట్టింది. డిటెక్టివ్ ఉజ్వలన్ చిత్రం నెట్‌ఫ్లిక్స్ వేదికగా జులై 11 నుంచి అందుబాటులోకి రానుందని ఆ సంస్థ ఒక పోస్టర్‌ను విడుదల చేసింది. ఎలాంటి నేరాలు జరగనటువంటి ప్రశాంతమైన ప్రాంతంలో ఓ సీరియల్ కిల్లర్ ఉంటే అక్కడ ఎలాంటి వాతావరణం ఉంటుంది. గ్రామ డిటెక్టివ్‌గా పనిచేస్తున్న ఉజ్వలన్ (ధ్యాన్ శ్రీనివాసన్) ఆ సీరియల్ కిల్లర్‌ను ఎలా కనిపెడితాడు..? అతన్ని పట్టించేందుకు పోలీసులకు ఎలాంటి సాయం చేశాడు..? ఆ సీరియల్ కిల్లర్ చేసిన హత్యలు ఏంటి..? వంటి అంశాలు ఈ చిత్రంలో ఆసక్తిగా తెరకెక్కించారు.

# ఆ ఒక్క కారణంతో రాత్రికి రాత్రే 9 ప్రాజెక్టుల నుంచి తీసేశారు...

చిత్ర పరిశ్రమలో రాణించడం చాలా కష్టం. ఇప్పుడు స్టార్ హోదాలో ఉన్నవారంతా ఒకప్పుడు ఎన్నో కష్టాలను అనుభవించే ఈ స్థాయికి వచ్చారు. ముఖ్యంగా హీరోయిన్లకు కెరీర్ ప్రారంభంలో ఎన్నో సమస్యలు వస్తుంటాయి. ఫస్ట్ చాన్స్ కోసం చాలా ఏళ్లుగా ఎదురు చూసినవాళ్లు కూడా ఉన్నారు. వచ్చిన ఆ ఒక్క చాన్స్‌ని సరిగ్గా వాడుకున్న వాళ్లే ఇప్పుడు స్టార్ హీరోయిన్లుగా మారారు. అలా అందరిలాకే కెరీర్ ప్రారంభంలో తాను కూడా చాలా ఇబ్బందులు పడ్డానని చెబుతోంది బాలీవుడ్ హీరోయిన్ విద్యా బాలన్. ఇప్పుడు పాన్ ఇండియా హీరోయిన్‌గా రాణిస్తున్న ఈ టాలెంటెడ్ నటిపై మొదట్లో 'ఐరెన్ లెగ్' అనే ముద్ర వేసి రాత్రికి రాత్రే 9 ప్రాజెక్టుల నుంచి తీసేశారట. ఈ విషయాన్ని తాజాగా ఓ యూట్యూబ్ చానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్వయంగా విద్యా బాలనే చెప్పింది. 'కెరీర్ ప్రారంభంలో నాకు మోహన్‌లాల్‌తో కలిసి 'చక్రం' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. షూటింగ్ ప్రారంభం అయిన కొన్నాళ్లకు అనూహ్యంగా అది ఆగిపోయింది. దానికి కారణం నేనే అని ప్రచారం జరిగింది. నాపై 'ఐరెన్ లెగ్' అనే ముద్ర వేసి ఘోరంగా విమర్శించారు. చక్రం సినిమా ఆగిపోయిందనే విషయం తెలియగానే రాత్రికి రాత్రే నేను ఒప్పుకున్న 9 ప్రాజెక్టుల నుంచి నన్ను తొలగించారు. అసలు ఆ సినిమా ఆగిపోవడానికి కారణం నేను కానే కాదు. ఆ మూవీ డైరెక్టర్, మోహన్‌లాల్ మధ్య బేధాభిప్రాయాలు రావడంతో సగంలోనే ఆపేశారు. అది నా కెరీర్‌పై చాలా ప్రభావం చూపింది. అయినా నేను ధైర్యం కోల్పోలేదు. విశ్వాసంతో ముందుకు సాగాను. నాపై నాకు ఉన్న నమ్మకే ఈ రోజు ఈ స్థాయిలో నిలబడేలా చేసింది. విశ్వాసంతో ముందుకుసాగితే ఏదోఒకరోజు కచ్చితంగా మనది అవుతుంది' అని విద్యా చెప్పుకొచ్చింది. కాగా, 2005లో పరిణిత మూవీతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విద్యా.. 'ది డర్టీ పిక్చర్'తో భారీ హిట్‌ని తన ఖాతాలో వేసుకుంది. సిల్క్ స్మిత జీవిత కథ ఆధారంగా వచ్చిన ఈ చిత్రంలో విద్యా లీడ్ రోల్ చేసింది. ఆమె నటనపై విమర్శకులు సైతం ప్రశంసలు కురిపించారు. ఆ తర్వాత వరుసగా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తూ.. బాలీవుడ్‌లోనే కాదు దేశమంతటా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుని సంపాదించుకుంది. ఇటీవల భూల్ భూలయ్య 3 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి.. మరో భారీ హిట్‌ని తన ఖాతాలో వేసుకుంది.



## పూజా హెగ్డే బ్యాడ్ టైం.. స్టార్ హీరో మూవీ నుండి ఔట్..!

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే. దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు అదరగొట్టింది. ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకొనే హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో మెప్పించింది. అరవింద సమేత వీర రాఘవ, మహర్షి, గద్దలకొండ గణేష్, హౌస్‌ఫుల్ 4, అల వైకుంఠపురంలో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలతో వరుస సక్సెస్ సాధించిన పూజా హెగ్డే ఆ తర్వాత మాత్రం హిట్ కోసం ఎంతో ఎదురు చూసింది. రాధే శ్యామ్ , బీస్ట్, ఆచార్య, సర్కస్, కిసి కా భాయ్, కిసి కీ జాన్, దేవా, రెట్రో సినిమాలు వరుసుగా ఫ్లాప్ అయ్యాయి. ఇటీవల వచ్చిన రెట్రో చిత్రంలో డీ గ్లామరైజ్డ్ పాత్ర పోషించగా, దీనిపై కూడా ఎన్నో ఆశలు పెట్టుకుంది. కాని అది కూడా అభిమానులకు నిరాశను మిగిల్చింది.

తాజాగా ఆమెకు దక్కాల్సిన ఓ క్రేజీ కోలీవుడ్ ఆఫర్ మిస్ అయినట్టు తెలుస్తుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, విగ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకునే యోచనలో ఉండగా, చివరికి ఆమె స్థానంలో మలయాళ బ్యూటీ మమితా బైజును ఫైనల్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు, 'ప్రేమలు' సినిమా ద్వారా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా దళపతి విజయ్, సూర్య వంటి టాప్ హీరోల ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటూ, దక్షిణాది చిత్ర పరిశ్రమలో దూసుకుపోతుంది. ఇప్పడు ధనుష్ సినిమా అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ దూసుకుపోయే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఇదే సమయంలో పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో ఆమె మార్కెట్‌లో కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలికమేనని, ఆమె బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు.అ యితే ఈ ఒక్క సినిమా మిస్ అయినా, పూజా చేతిలో ప్రస్తుతం రజనీకాంత్, విజయ్, రాఘవ లారెన్స్ లాంటి స్టార్ హీరోలతో భారీ ప్రాజెక్టులు చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్‌లతో బిజీగా ఉన్న పూజా, త్వరలోనే మళ్లీ ఫాంలోకి వస్తారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## ఐ లవ్ యూ చెబితే ఓకే చెప్పేశాను: అనుష్క

నటి అనుష్క . ఈ పేరు వినగానే గుర్తుకు వచ్చేది అరుంధతి, బాహుబలి చిత్రాలే. నిజానికి ఈ మంగళూరు బ్యూటీ అంతకుముందు చాలా హిట్ చిత్రాల్లో నటించారు. వాటిలో ఎక్కువగానే గ్లామరస్ పాత్రలు పోషించి అభిమానులను కనువిందు చేశారు. ముఖ్యంగా 'రెండు' అనే తమిళ మూవీతో పాటు 'బిల్లా'లో స్విమ్మింగ్‌పూల్ సీన్ కోసం ఆమె అందాల ఆరబోతకు యూత్ ఫిదా అయ్యారు. అయితే ఆమెలోని నట విశ్వరూపాన్ని తెరపై ఆవిష్కరించిన తొలి చిత్రం మాత్రం అరుంధతినే. ఆ తరువాత అనుష్క పయనమే మారిపోయింది. ఏ చిత్రంలోనైనా ఒక హీరోయిన్ పాత్రను చూస్తే ఆ పాత్రలో అనుష్క అయితే ఇంకా బాగా నటించేవారు అని అనుకునే ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటి ఆమె. ఒక పాత్ర కోసమే బరువు పెంచుకున్న నటి ఎవరైనా ఉన్నారంటే అది అనుష్కనే అవుతారు. అలాంటి అద్భుత నటి వయసు ఇప్పుడు 43 ఏళ్లు. అయినా అవివాహితగానే ఉన్నారు. ఈమె ప్రేమ గురించి చాలా వదంతులు దొర్లుతూనే ఉన్నాయి. కాగా చాలా మందికి బాల్యంలో లవ్ స్టోరీస్ ఉంటాయి. అనుష్క బాల్యంలోనే ఒక లవ్ స్టోరీ ఉందట. ఈ విషయాన్ని తనే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొనడం విశేషం. 'నేను ఆరవ తరగతి చదువుతున్నప్పుడు అదే తరగతి చదువుతున్న సహ విద్యార్థి నా వద్దకు వచ్చి ఐ లవ్ యూ' అని చెప్పాడు. ఆ వయసులో ఐ లవ్ యూ అంటే ఏమిటో కూడా తెలియదు. అయినా అతనికి ఓకే అని చెప్పాను. ఆ విషయం గుర్తుకు వస్తే ఇప్పటికీ మధురమైన అనుభూతిని కలిగిస్తుంది అని అన్నారు. కాగా చిన్న గ్యాప్ తరువాత అనుష్క కథానాయికగా నటించిన ఘాటీ త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. అదే విధంగా అనుష్క తొలిసారిగా మలయాళంలో నటిస్తున్న చిత్రం షూటింగ్ దశలో ఉంది.





## 29 మంది సెలబ్రిటీలపై ఈడీ కేసు

బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో ఈడీ దూకుడు చూపింది. ఈ కేసులో 29 మంది సినీ సెలబ్రిటీలతో పాటు 4 కంపెనీలపై ఈడీ కేసు నమోదు చేసింది. అందులో సినీ నటీనటులతో పాటు యాంకర్లు, బుల్లితెర నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఉన్నారు. కేసు నమోదు అయిన వారిలో విజయ్ దేవరకొండతో పాటు రానా ,మంచు లక్ష్మి, ప్రకాష్ రాజ్ ,నిధి అగర్వాల్, అనన్య నాగళ్ళ, శ్రీముఖి, ప్రణిత, విష్ణు ప్రియ వంటి ప్రముఖులు ఉన్నారు. హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు గతంలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడి కేసు విచారణ ప్రారంభించింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు గాను వారు పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారికి సంబంధించిన ఐటీ రిటర్న్‌లలో ఈ లెక్కలు లేవని అధికారులు గుర్తించారట. దీంతో మనీ లాండరింగ్ కింద కేసు ఈడీ కేసు నమోదు చేసింది. బెట్టింగ్ యాప్‌లకు విషయంపై గతంలోనే విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి టీమ్ ఒక ప్రకటన చేసింది. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు వారు ప్రచారకర్తలుగా వ్యవహరించలేదని, నైపుణ్య ఆధారిత గేమ్‌లకు మాత్రమే ప్రచారం చేశారని వారిద్దరి టీమ్స్ వేర్వేరుగా ప్రకటన చేశాయి. చట్టపరమైన అనుమతులు ఉన్న వాటికి మాత్రమే ప్రచారకర్తగా వ్యవహరించారని వారు తెలిపారు. ఏ23 అనే కంపెనీతో విజయ్ చేసుకున్న ఒప్పందం ఇప్పటికే ముగిసిందని తెలుపగా రానా కుదుర్చుకున్న ఒప్పందం 2017లోనే పూర్తయ్యిందని పేర్కొన్నారు. నటుడు ప్రకాశ్‌రాజ్ కూడా 2016లోనే తను ఒప్పందం చేసుకున్న కంపెనీతో డీల్ ముగిసిందని తెలిపారు. అయితే, బెట్టింగ్ యాప్స్ కేసులో ఇప్పటికే చాలామంది నటీనటులను హైదరాబాద్ పోలీసులు విచారించారు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY N SREENIVAS RAO, PUBLISHED AT 1-9-18/4-1, RAMNAGAR X ROAD, HYDERABAD. PRINTED AT SRI MATHA PRINTERS,H NO 1-1-562/1,GANDHI NAGAR, HYDERABAD.
REGD NO : APTEL/2003/9316. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034